# ఆదిలాబాద్ వార్త

మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

శుక్రవారం 13, మార్చి 2026






ప్రభుత్వ ఉద్యోగం కోసం ప్రయత్నాలు విఫలం...

# యువకుడు ఆత్మహత్య

- పోలీసులకు తండ్రి ఫిర్యాదు
- సూసైడ్ నోట్‌లో ఆవేదన వెల్లడి


**మందమర్రి, మార్చి 12, ప్రభాతవార్త**

మందమర్రి మండల పరిధిలోని లంబాడి తండా ప్రాంతానికి చెందిన యువకుడు ఉద్యోగం రాక మానసిక ఒత్తిడికి గురై ఆత్మహత్యకు పాల్పడిన విషాద ఘటన వెలుగులోకి వచ్చింది. మృతుడి తండ్రి అలిశెట్టి రాజయ్య తెలిపిన వివరాల ప్రకారం, తన కుమారుడు అలిశెట్టి హరీష్ ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం రోజున ఉదయం రాజయ్య మేషన్ పనుల నిమిత్తం దేవాపూర్‌కు వెళ్లగా, ఆయన భార్య గంగవ్వ బంధువుల ఇంట్లో జరిగిన ప్రమాదం కారణంగా జన్నారంకు వెళ్లింది. ఆ సమయంలో ఇంట్లో హరీష్ ఒక్కడే ఉన్నట్లు మిగతా 2లో..

జిల్లాలో పదో తరగతి పరీక్ష కేంద్రాల వద్ద

# పటిష్ట పోలీస్ బందోబస్తు

- ✶ పరీక్ష కేంద్రాల వద్ద 163 బీఎన్ఎస్ఎస్ సెక్షన్ విధింపు
- ✶ జిల్లా ఎస్పీ నితికాపంత్



**కాగజ్‌నగర్ రూరల్, మార్చి 12, ప్రభాతవార్త**

కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో నిర్వహించనున్న పదవ తరగతి (ఎస్ఎస్‌సి) వార్షిక పరీక్షల నేపథ్యంలో పరీక్షలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు ఎటువంటి ఆందోళన లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా ఎస్పీ నితికా పంత్ తెలిపారు. జిల్లాలో పదవ తరగతి పరీక్షా కేంద్రాల వద్ద 163 బీఎన్ఎస్ఎస్ సెక్షన్ విధింపు చేసినట్లు పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద శాంతిభద్రతలు పరిరక్షించేందుకు భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్-2023) సెక్షన్ 163 అమలులో ఉంటుందని తెలిపారు. ఈ ఉత్తర్వుల ప్రకారం జిల్లాలోని 38 పరీక్షా కేంద్రాల చుట్టూ 200 మీటర్ల పరిధిలో ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుమిగూడటాన్ని నిషేధించినట్లు తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయన్నారు. ఈ ఆంక్షలు మార్చి 14, 2026 నుండి ఏప్రిల్ 16, 2026 వరకు పరీక్షలు జరిగే ప్రతి రోజూ ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు అమలులో ఉంటాయని, పరీక్షా కేంద్రాల పరిసరాల్లో కర్రలు, రాళ్లు, ఆయుధాలు లేదా ఇతర ప్రమాదకరమైన వస్తువులు తీసుకురావడం నేరమని పేర్కొన్నారు. పరీక్షలు జరుగుతున్న సమయంలో పరీక్షా కేంద్రాల సమీపంలోని అన్ని జిరాక్స్ సెంటర్లు తప్పనిసరిగా మూసివేయాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల అధికారులు తగిన భద్రతా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ ఉత్తర్వులను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



జిల్లా అభివృద్ధికి

# కృషి చేయండి

★ నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్, మార్చి 12, ప్రభాతవార్త:**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా క్షేత్రస్థాయి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని తిరుమల గార్డెన్‌లో నిర్వహించిన అవగాహనా సమావేశంలో శాసనసభ్యులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, వెడ్మ బొజ్జు పటేల్, రామారావు పటేల్‌లతో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాలు ప్రతి గడపకూ చేరాలని, అభివృద్ధి పనుల్లో ఎక్కడా జాప్యం మిగతా 2లో..

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం అమలులో

# ప్రజాప్రతినిధుల పాత్ర కీలకం

★ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల/క్యాతన్‌పల్లి, మార్చి 12, ప్రభాత వార్త**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం అమలులో ప్రజా ప్రతినిధుల పాత్ర కీలకమైనదని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలో గల అమ్మ గార్డెన్స్‌లో గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు, మున్సి పల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లకు 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంపై ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి డిసిపి ఎ.భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్థానిక సంస్థలు, మున్సిపల్ ఎన్నికలు నిర్వహించి ప్రజాప్రతినిధులను ఎన్నుకోవడం జరిగిందన్నారు. గ్రామపంచాయతీల సర్పంచ్‌లకు శిక్షణ తరగతులు నిర్వహించడం జరిగిందని, పంచాయితీ రాజ్ చట్టాలు మిగతా 2లో..



వసతి గృహ విద్యార్థులకు

# మెరుగైన విద్యనందించాలి

**ఉట్నూర్, మార్చి 12, ప్రభాతవార్త :**

ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని అర్థమయ్యే రీతిలో భోదించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మార్మాట్ అన్నారు. గురువారం నార్నూర్ మండలం గిరిజన ఆశ్రమ పాఠశాల జండా దిశ మోడల్ స్కూల్ ను ప్రాజెక్ట్ అధికారి సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న విద్య, వైద్యం, భోజనంపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో ఇష్ట గోష్టితో మాట్లాడుతూ ఏమైనా సమస్యలు ఉన్నాయా సమయానికి భోజనాన్ని అందిస్తున్నారా మెనూ ప్రకారంగా అందిస్తున్నారా భోజనాలు రుచికరంగా ఉన్నాయా అని తెలుసుకొని క్లాస్ రూమ్‌లో విద్యార్థులతో ముచ్చటించి వారికి పాఠాలను బోధించారు విద్యార్థులకు వండిన ఆహారాన్ని రుచిని ఆస్వాదించారు, అలాగే కంప్యూటర్ ల్యాబ్ ను పరిశీలించారు ,ఐటీడీఏ పల్స్ యాప్ పనితరుపై ఆరా తీశారు, పదవ తరగతి విద్యార్థులకు 100 ఉతీర్ణత వచ్చే విధంగా చదివిపించాలని ఉపధ్యాయులకు తెలిపారు, పల్స్ యాప్ పై ఏమైనా సమస్య ఉంటే తమ దృష్టిలోకి మిగతా 2లో..



### వసతి గృహ విద్యార్థులకు

# మెరుగైన విద్యనందించాలి

**(మొదటిపేజీ తరువాయి)**

తీసుకురావాలని పేర్కొన్నారు ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ప్రతిరోజూ మెనూ ప్రకారం పోషక విలువలు గల ఆహారాన్ని అందించాలన్నారు వార్డెన్, ప్రిన్సిపల్కు, కామటీ, వంట పని వారు, శానిటరీ మరియు మల్టీపర్పస్ వర్కర్లు తో అన్నారు సబ్జెక్టుల వారీగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలనీ తెలిపారు. దోమల వలన వ్యాపించే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా, వసతి గృహ పరిసరాలలో నిత్యం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రతిరోజు వంటగది, స్టోర్ రూమ్, తాగునీరు, మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు భోదించారు. సబ్జెక్టుల వారీగా ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం తప్పనిసరిగా రావాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమాలలో, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



### ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం అమలులో

# ప్రజాప్రతినిధుల పాత్ర కీలకం

**(మొదటిపేజీ తరువాయి)**

వివరించడం జరిగిందని తెలిపారు. మార్చి 6 నుంచి జూన్ 12వ తేదీ వరకు 99 రోజుల పాటు ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం చేపట్టడం జరిగిందని తెలిపారు. గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో కార్యాచరణ అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలలో పారిశుధ్యం, ప్రభుత్వ కార్యాలయాలలో పెండింగ్ లో ఉన్న ఫైళ్ల క్లియరెన్స్ తదితర అంశాలపై కార్యాచరణ, సమాజ హిత అంశాలపై ప్రణాళికలు అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అమలు చేయడంలో ప్రజా ప్రతినిధులు తీసుకోవలసిన చర్యల గురించి తెలుసుకోవాలని తెలిపారు. తెలంగాణ పంచాయతీరాజ్ మున్సిపల్ యాక్ట్ల గురించి ప్రజాప్రతినిధులకు సంక్షిప్తంగా వివరించడం జరుగుతుందని తెలిపారు. విద్యా రంగ అభివృద్ధి దిశగా అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల సౌకర్యార్థం మౌలిక వసతులు, విద్యుత్, త్రాగునీరు, మూత్రశాలలు, ప్రహరీ గోడ నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలతో చేపట్టడం జరిగిందని, ఇందులో భాగంగా ఉపాధి హామీ కింద పనులు చేయడం జరిగిందని తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళలను అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ అభివృద్ధి పనులలో భాగస్వామ్యలను చేయడం జరిగిందని తెలిపారు. రేషన్ కార్డు కొరకు దరఖాస్తు చేసుకున్నట్లయితే క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులైన లబ్ధిదారులకు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలలో నెలకొన్న సామాజిక సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని తెలిపారు. నిరుద్యోగ యువత భవిష్యత్తు దృష్ట్యా మాదకద్రవ్యాల నిరోధకం, మద్యం వినియోగంపై ప్రజా ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా 2, 3 వార్డులలో 3, 4 రోజుల పాటు పారిశుధ్యం, తాగునీటి పైప్ లైన్ల మరమ్మత్తు, ఇతర పనులు చేపట్టడం జరుగుతుందని, ప్రజా ప్రతినిధులు కార్యక్రమాలలో పాల్గొని ప్రజలను భాగస్వామ్యులను చేయాలని తెలిపారు. పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా ప్రతి రోజు ప్రతి ఇంటి నుండి చెత్త సేకరణ నిరంతరాయంగా కొనసాగించాలని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలలో ఒకసారి లబ్ధి పొందిన వారిని గుర్తించాలని, మరల లబ్ధిదారుల జాబితాలో వారి వివరాలు లేకుండా జాగ్రత్త వహించాలని, తద్వారా అర్హత గల మిగిలిన లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరుతుందని, ప్రభుత్వ లక్ష్యాలు విజయవంతం అవుతాయని తెలిపారు. రహదారి ప్రమాదాల నివారణలో భాగంగా ప్రతి ఒక్కరు రహదారి భద్రత నియమాలను పాటించే విధంగా ప్రజా ప్రతినిధులు వారి పరిధిలో అవగాహన కల్పించాలని తెలిపారు. మున్సిపల్ పాలకవర్గం ఏర్పాటు చేయబడినందున మున్సిపల్ అభివృద్ధి కొరకు నిధులు మంజూరు అవుతాయని, ఈ నిధులను సక్రమంగా వినియోగిస్తూ ప్రజా ప్రయోజనకర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. వేసవిలో ప్రజలకు నిరంతరం నీటిని సరఫరా చేసే విధంగా ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలను ప్రజాప్రతినిధులు తమ పరిధిలో పకడ్బందీగా అమలు చేయాలని, నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలిపారు. విద్యుత్ దీపాల ఏర్పాటులో సౌర విద్యుత్ దీపాల ఏర్పాటుపై దృష్టి సారించాలని, తద్వారా విద్యుత్ వినియోగాన్ని నియంత్రించవచ్చని తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం అమలులో ప్రజా ప్రతినిధుల విధులు, అధికారాలు తెలుసుకొని ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసి ప్రజాసంక్షేమం ఉందిగా కృషి చేయాలని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక కార్యక్రమం అమలులో ప్రజా ప్రతినిధుల పాత్ర కీలకమైనదని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల మేయర్ ధరణి మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్య, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలి

**సారంగాపూర్, మార్చి 12, ప్రభాతవార్త:**



నర్సాపూర్ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల నూతన భవన నిర్మాణానికి వెంటనే నిధులు కేటాయించాలని తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు దర్శనం దేవేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత రెండేళ్ల క్రితం మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా ప్రారంభమైన భవన నిర్మాణం నిధుల కొరతతో మధ్యలోనే ఆగిపోయిందని తెలిపారు. సుమారు 600 మంది విద్యార్థులు ఉన్న ఈ పాఠశాలలో 11 సెక్షన్లు నడుస్తున్నాయని, తగినన్ని గదులు లేక ఒక్కో తరగతిలో 70 నుండి 80 మంది విద్యార్థులు కూర్చోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గదుల కొరత వల్ల విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారని, ఇది వారి చదువుపై ప్రతికూల ప్రభావం చూపుతోందని పేర్కొన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు స్పందించి నిధులు విడుదల చేయాలని, భవన నిర్మాణం త్వరగా పూర్తయ్యేలా చూడాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

### ప్రభుత్వ ఉద్యోగం కోసం ప్రయత్నాలు విఫలం...

# యువకుడు ఆత్మహత్య

**(మొదటిపేజీ తరువాయి)**

తెలిపారు. సాయంత్రం సుమారు 6.30 గంటలకు రాజయ్య ఇంటికి చేరుకోగా తలుపులు మూసి ఉండటంతో కుమారుడిని పలుమార్లు పిలిచినా స్పందన లేకపోవడంతో తలుపును బలంగా తోసి లోపలికి వెళ్లారు. ఇంట్లో దూలానికి లుంగీతో ఉరివేసుకుని హరీష్ మృతిచెందినట్లు గుర్తించారు. అతని ప్యాంటు జేబులో సూసైడ్ నోట్ కూడా లభించింది. అందులో మైనింగ్ డిప్లొమా పూర్తి చేసి ఏ.ఎం.ఐ.ఈ. ఇంజనీరింగ్ చదవాలని ఆశపడ్డానని, మధ్యలో చదువు ఆపి పనిచేస్తూ ఓపెన్ డిగ్రీ పూర్తి చేశానని, ప్రభుత్వ ఉద్యోగాల కోసం ప్రయత్నించినా రాకపోవడంతో తీవ్ర నిరాశకు గురై మానసిక ఒత్తిడికి లోనై ఈ నిర్ణయం తీసుకున్నానని రాసి ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రస్తుతం హరీష్ మృతదేహాన్ని బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# జిల్లా అభివృద్ధికి కృషి చేయండి

**(మొదటిపేజీ తరువాయి)**

జరగకూడదని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా దిశానిర్దేశం చేశారు. అనంతరం, మండలాల వారీగా విచ్చేసిన సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లతో కలెక్టర్ విడివిడిగా భేటీ అయ్యారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్న కలెక్టర్, వారితో కలిసి సామూహిక చిత్రాలు దిగారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్న కళ్యాణి, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీఓ వధూవరులను ఆశీర్వదించిన అధికారులు

**జైనూర్, మార్చి 12, ప్రభాతవార్త;**



కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండల పంచాయతీ అధికారి భుక్య శశి కుమార్ శ్రావణి వివాహ వేడుకలు గురువారం నిర్మల్ జిల్లా కడెం మండలంలోని చిన్న బిల్లాల్ గ్రామంలో ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో జైనూర్ ఎంపీడీవో సుధాకర్ రెడ్డి, జైనూర్ తాసిల్దార్ ఆడబీర్షావ్‌తో పాటు అధికారులు పంచాయతీ కార్యదర్శులు పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. వారికి కానుకలు సమర్పించి వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వేడుకల్లో జైనూర్ సూపర్డెంట్ శ్రీనివాస్ సీనియర్ అసిస్టెంట్ మోహన్, టైపిస్ట్ గౌతమ్, జైనుర్ మాజీ వైస్ ఎంపీపీ చిర్లే లక్ష్మణ్ యాదవ్, బిఆర్ఎస్ నాయకులు ధరమ్ సింగ్, ఎంపీడీవో కార్యాలయ ఉద్యోగులు మండల పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## మద్దికాయల ఓంకార్ శత జయంతి వార్షికోత్సవ సభను విజయవంతం చేయండి

**- ఎంసిపిఐయు అమరవీరుల స్థూపం వద్ద గోడ ప్రతుల ఆవిష్కరణ**

**బెల్లంపల్లి, మార్చి 12, ప్రభాతవార్త**

వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు, మాజీ శాసనసభ్యులు, ఎంసీపీఐయు పార్టీ వ్యవస్థాపకులు కామ్రేడ్ మద్దికాయల ఓంకార్ శత జయంతి వార్షికోత్సవం సందర్భంగా వాల్ పోస్టర్లు విడుదల చేయడం జరిగింది. అనంతరం జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ మాట్లాడుతూ కామ్రేడ్ ఓంకార్ తన ఆరున్నర దశాబ్దాల రాజకీయ ప్రస్థానంలో ఏ శక్తులకు లొంగ కుండా రాజకీయాలకు విలువలు అద్దిన రాజకీయ దురంధరుడు, నిత్యం ప్రజల కోసం జీవించిన ఆయనను శత్రువు హత్య దాడులు చేసిన చావుకు తలవంచని మృత్యుంజయుడనీ, ప్రజా సమస్యలపై చట్టసభలలో ప్రజాగణం వినిపించిన అసెంబ్లీ టైగర్ గా తెలుగు రాష్ట్రాల ప్రజలు మెచ్చిన నిస్వార్థ ప్రజా సేవకుడు కామ్రేడ్ మద్దికాయల ఓంకార్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంసిపిఐయు పార్టీ బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి, ఆరెపల్లి రమేష్, తొగరి రాహుల్, మహిళా సమైక్య జిల్లా అధ్యక్షురాలు కంపెల్లి రాధా, సబ్బని రాజశేఖర్, ఖమ్మం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



# అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయించాలి

- బెల్లంపల్లిలో భారతీయ జనతా పార్టీ

## నాయకుల భిక్షాటన

బెల్లంపల్లి, మార్చి 12, ప్రభాతవార్త



మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో భిక్షాటన కార్యక్రమం నిర్వహించారు. అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కేటాయించాలని షాప్ షాపుకు తిరుగుతూ జోలె పట్టి భిక్షాటన చేసిన జిల్లా ఉపాధ్యక్షులు కోడి రమేష్. ఈ కార్యక్రమంలో వారితోపాటు పట్టణ అధ్యక్షురాలు దార కళ్యాణి, జిల్లా కార్యదర్శి రాచర్ల సంతోష్ కుమార్ ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బెల్లంపల్లి పట్టణంలో నిన్న విడుదల చేసిన డబుల్ బెడ్రూం ఇండ్లకు సంబంధించిన జాబితాను విడుదల చేయడం జరిగింది. ఆ జాబితాలో కాంగ్రెస్ నాయకులైతే ఇంద్రమ్మ ఇళ్లయినా వస్తాది డబుల్ బెడ్ రూమ్ లైన వస్తాయి అనే విధంగా ఆ జాబితా ఉంది. గతంలో ఇద్దరు కాంగ్రెస్ నాయకులు ఒక డబుల్ బెడ్ రూమ్ రావాలంటే 3 లక్షల రూపాయలు ఇచ్చే వాళ్లను చూసుకోండి వాళ్ళకి ఇప్పిదం అని మాట్లాడుకున్న రికార్డింగ్ బెల్లంపల్లిలో చాలామంది వినే ఉంటారు. ఇప్పుడు ఈ లిస్టులో ఒక్కొక్కరి చొప్పున 3 లక్షలు వసూలు చేస్తే సుమారు ఐదు కోట్ల కుంభకోణం. ఈ కుంభకోణం స్థానిక ఎమ్మెల్యే పిఏల కనుసన్నల్లోనే జరుగుతుంది. నిరుపేద ప్రజలు లక్షల రూపాయల లంచం ఇచ్చే పరిస్థితిలో లేరు కాబట్టి వారి పక్షాన భారతీయ జనతా పార్టీ తరపున బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు కోడి రమేష్ భిక్షాటన చేయడం జరిగింది అన్నారు. ఇంత జరుగుతున్న మన ఎమ్మెల్యే కు తెలియకుండానే ఇదంతా జరుగుతుందా అని భారతీయ జనతా పార్టీ తరఫున ప్రశ్నిస్తున్నాం అని అన్నారు. అర్హులైన వారికి డబుల్ బెడ్ రూమ్లు కేటాయించని ఎడల భారతీయ జనతా పార్టీ నిరుపేదల పక్షాన ఉండి కొట్లాడుతుందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి గోమాస కమల, ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి కోడి సురేష్, పట్టణ కోశాధికారి సంతోష్, అగర్వాల్, సుక్క మల్లేష్, సోషల్ మీడియా కన్వీనర్ తోటపల్లి ఓం సాయి, పుల్లూరి రాము, పుల్లె ప్రశాంత్, ఎర్రోజు శ్రీనివాస్, జంగంపల్లి సాగర్, పోలోజు సందీప్, గాద సూర్య తేజ, వంశీ, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

## పీజీ సీట్లు సాధించిన వైద్యులకు ఘన సన్మానం

మందమర్రి, మార్చి 12, ప్రభాతవార్త



మందమర్రి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ రమేష్, డాక్టర్ మానస పీజీ సీట్లు సాధించిన సందర్భంగా బీఆర్ఎస్ పట్టణ నాయకులు గురువారం ఘనంగా సన్మానించారు. ఉన్నత చదువుల నిమిత్తం బదిలీపై వెళ్లనున్న నేపథ్యంలో వారిని శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మందమర్రి ప్రజలకు డాక్టర్ రమేష్, డాక్టర్ మానస అందించిన వైద్య సేవలను కొనియాడారు. పీజీ సీట్లు సాధించడం వారి కృషి, ప్రతిభకు నిదర్శనమని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు. అనంతరం నాయకులు వైద్యులకు తీపి పదార్థాలు తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎండి అబ్బాస్, బర్ల సదానందం, వేముల నర్సయ్య, సాగర్ బాబు, మజారు, సలవుద్దిన్, నోముల శ్రీధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మాట తప్పని సర్పంచ్..

## ఎన్నికల హామీ నెరవేరుస్తున్న సర్పంచ్ ముల్కల్ల శ్రీలత సత్యనారాయణ

వేమనపల్లి, మార్చి 12, ప్రభాతవార్త



సర్పంచ్ ఎన్నికల ప్రచార నిమిత్తం ఇచ్చిన హామీని నెరవేర్చారు. మండలంలోని నాగారం గ్రామపంచాయతీ సర్పంచ్ ముల్కల్ల శ్రీలత సత్యనారాయణ గ్రామంలో ఆడబిడ్డ పెళ్లి కానుకగా రూ.5 వేలు ఇస్తానని హామీ ఇవ్వగా ఇచ్చిన మాటకు కట్టుబడి గురువారం నాగారం గ్రామం మడే మారయ్య కూతురు వివాహానికి 5 వేల నగదు మాజీ జడ్పీటీసీ ఆర్. సంతోష్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సయ్యద్ సాబీర్ అలీ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కుర్రు వెంకటేశం, గాలి మధు, దొంతుల శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు పాలనను చేరువ చేయడమే మా ప్రభుత్వ లక్ష్యం

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

జన్నారం, ప్రభాతవార్త



ప్రజలకు పాలనను చేరువ చేయడమే మా ప్రభుత్వ లక్ష్యం అని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. జన్నారం మండలంలోని చింతగూడెం గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనం ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి, కార్యాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేసి ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకుపోవడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ సుతారి సుమలత వినయ్ గ్రామంలో ఉన్న తాగునీరు, రిక్వెస్ట్ బస్ స్టాప్, డ్రైనేజీ వసతుల వంటి పెండింగ్ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దానికి సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, ఎంపిడివో, పంచాయతీ కార్యదర్శి, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రైతు బంధు రైతుల హక్కు

ఉట్నూర్, మార్చి 12,ప్రభాతవార్త :



మండలం వడోని గ్రామంలో గురువారం రైతు కూలీలతో బంజారా జాగృతి భజన మండలి రాష్ట్ర అధ్యక్షుడు భరత్ చౌహాన్ సమావేశమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సమస్యలను గాలికొదిలేసిందని ఆయన విమర్శించారు. ప్రభుత్వం రైతుల ఉసురు పోసుకుంటోందని ఆరోపించారు. వెంటనే రైతుబంధు విడుదల చేసి, ఉపాధి కూలీలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా రైతులతో కలిసి భారీ ఆందోళనలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.



## పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం

- మండల విద్యాధికారి మహేందర్

సారంగాపూర్, మార్చి 12, ప్రభాతవార్త:

మండలంలో ఈనెల 14 నుంచి ప్రారంభం కానున్న పదవ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాధికారి మహేందర్ తెలిపారు. ఈనెల 14 నుండి ఏప్రిల్ 13 వరకు ప్రధాన పరీక్షలు, ఏప్రిల్ 15, 16 తేదీల్లో ఒకేషనల్ పరీక్షలు జరుగుతాయన్నారు. మండలంలోని 450 మంది విద్యార్థుల కోసం 3 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఉదయం 9:30 నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తామని వివరించారు. పరీక్షల నిర్వహణ కోసం 4గురు చీఫ్ సూపరింటెండెంట్లు, ఒక కస్టోడియల్ ఆఫీసర్, ముగ్గురు డిపార్ట్మెంట్ ఆఫీసర్లు, 22 మంది ఇన్విజిలేటర్లను నియమించినట్లు పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాల పర్యవేక్షణలో ప్రశ్నపత్రాలను తెరుస్తామని, సెల్ ఫోన్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి లేదని స్పష్టం చేశారు. విద్యార్థులు ఎలాంటి భయం లేకుండా పరీక్షలు రాసేలా వారిని సన్నద్ధం చేశామని ఆయన తెలిపారు.



వినతిపత్రం అందజేస్తున్న వెంగ్వాపేట్ సర్పంచ్

## ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం

నిర్మల్ ప్రతినిధి, మార్చి 12, ప్రభాతవార్త:

నిర్మల్ రూరల్ మండలం వెంగ్వాపేట్ గ్రామ పరిధిలోని కాల్వవాగుపై వంతెన నిర్మించాలని కోరుతూ సర్పంచ్ సాద వనిత విజయ్ గురువారం నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. వాగుపై వంతెన లేకపోవడంతో గ్రామ ప్రజలతో పాటు పరిసర ప్రాంతాల వారు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆమె ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా వర్షాకాలంలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయని, ఈ వంతెన నిర్మాణం పూర్తయితే బీరవెల్లి, ప్యారమూర్, తాండ్రా, వంజర్, కంకేట, దోనిగాం, గొల్లమాడ గ్రామస్థులకు నిర్మల్ పట్టణానికి వెళ్లేందుకు సుమారు 8 కిలోమీటర్ల దూరం తగ్గుతుందని వివరించారు. ఈ సమస్యను సానుకూలంగా స్పందించి, వెంటనే నిధులు మంజూరు చేయాలని ఆమె కోరారు.

## అగ్నిప్రమాద బాధితులు ధైర్యంగా ఉండాలి

- అండగా ఉంటా: ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ, మార్చి 12, ప్రభాతవార్త:



అగ్నిప్రమాద బాధితులు ధైర్యంగా ఉండాలని నేను మీకు అండగా ఉంటానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. నేరడిగొండ మండలం బొరిగామ గ్రామంలో ప్రమాదవశాత్తు జరిగిన అగ్నిప్రమాద స్థలాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ ప్రమాదంలో నాలుగు ఇండ్లు, మూడు పశువుల పాకలు దగ్ధం కావడంపై ఆయన విచారం వ్యక్తం చేశారు. బాధితులు ఎవరూ ఆందోళన చెందవద్దని, అందరికీ న్యాయం జరిగేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. అగ్నిప్రమాదంలో ఇండ్లు కోల్పోయిన వారందరికీ ప్రభుత్వం తరపున ఇండ్లు మంజూరు చేయించే బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. ఇల్లు పూర్తిగా కాలిపోయిన జాదవ్ ప్రేమ్‌సింగ్‌కు వ్యక్తిగతంగా రూ. 30 వేల ఆర్థిక సాయం అందజేశారు. అదేవిధంగా బాధితులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పరీక్షలపై భయం విడిచి ఆత్మవిశ్వాసంతో రాయాలి

★ మోటివేషనల్ స్పీకర్ ధర్మపురి వెంకటేశ్వర్లు ★ పదవ తరగతి విద్యార్థులకు మోటివేషనల్ తరగతులు


సమావేశంలో మాట్లాడుతున్న మోటివేషనల్ స్పీకర్


మోటివేషనల్ తరగతులకు హాజరైన విద్యార్థిని, విద్యార్థులు

**తిర్యాని, మార్చి 12 ప్రభాతవార్త:**

విద్యార్థులు పరీక్షలంటే భయపడకుండా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ ధర్మపురి వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మండలంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల గిన్నేదరి, చెలమెల, పంగిడి మాదారం, రొంపల్లి ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలకు సిద్ధం చేయడం కోసం మోటివేషనల్ తరగతులను మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, లక్ష్య సాధనపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. విద్యార్థులను ఉద్దేశించి ధర్మపురి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పరీక్షల పట్ల భయాన్ని విడిచి పెట్టి ఎలాంటి అపోహలకు లోనుకాకుండా ధైర్యంగా పరీక్షలు రాయాలని సూచించారు. ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేస్తూ చదువుపై నిజమైన ఆసక్తిని పెంపొందించుకోవాలని చెప్పారు. విజయానికి ఐదు సూత్రాలుక్రమశిక్షణతో ప్రణాళికాబద్ధంగా చదువుతూ వచ్చే సందేహాలను వెంటనే నివృత్తి చేసుకోవాలని ఆయన సూచించారు. విజయాన్ని సాధించడానికి ఐదు ముఖ్య సూత్రాలను వివరించారు. నిరంతర సాధన, చెడు అలవాట్లకు దూరంగా ఉండటం, సెల్‌ఫోన్ , సినిమాల ప్రభావం తగ్గించడం, రోజుకు కనీసం ఎనిమిది గంటల నిద్రపోవడం, శారీరక వ్యాయామం చేయడం, మానసిక భావోద్రేకాలను నియంత్రించడం వంటి అంశాలు జీవితంలో విజయానికి దోహదపడతాయని వివరించారు. విద్యార్థుల బలాలు, బలహీనతలు, అవకాశాలు, అవరోధాలను గుర్తించి వాటిని ఎలా ఎదుర్కోవాలో ప్రయోగాత్మకంగా వివరించారు. పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించి జిల్లాను ముందువరుసలో నిలపాలని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏసీఎంఓ ఉద్ధవ్ మాట్లాడుతూ విద్యతోనే విద్యార్థులకు బంగారు భవిష్యత్తు సాధ్యమవుతుందని పేర్కొన్నారు. విద్యార్థుల జీవితాన్ని మార్చేది విద్య ఒక్కటేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ ఆఫీసర్ మాడవి శేఖు, ప్రధానోపాధ్యాయులు ఎన్. కృష్ణారావు, చంద్రకాంత్ గోపాల్, యాదవరావు, సాగర్, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, విజయశాంతి, సుభాష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## ఎటువంటి భయాందోళనలకు గురి కాకుండా పరీక్షలు రాయాలి

**జన్నారం, మార్చి 12, ప్రభాతవార్త**



ఈ నెల 14 నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు ఎలాంటి భయాందోళనలకు గురి కాకుండా పరీక్షలు రాయాలని ఏబీవీపీ రాష్ట్ర నాయకుడు పందిరి మనీష్ విద్యార్థులకు సూచించారు. గురువారం రోజు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన పదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసికంగా దృఢంగా ఉండాలని, మంచిగా చదువుకొని పరీక్షలు రాయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రెసిడెంట్ గుర్రపు రిశ్వంత్, విద్యార్థులు పాల్గొన్నారు

## సేంద్రియ పద్ధతుల్లో కూరగాయలు పండించాలి

**హాజీపూర్, మార్చి 12, ప్రభాతవార్త**

ఆత్మ ఆధ్వర్యంలో భూసార పరీక్షలు, విశ్లేషణ, సంప్రదాయ పంటల నుంచి కూరగాయల సాగుకు పంట మార్పిడి శిక్షణ కార్యక్రమం గురువారం రోజు గుడిపేట్ రైతు వేదికలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ కృష్ణ మాట్లాడుతూ రైతులు కేవలం రసాయన ఎరువులు మాత్రమే వాడుతున్న సందర్భంలో, రసాయన ఎరువులు తగ్గించుకుంటూ పచ్చిరొట్ట, పశువుల ఎరువులు, నానో యూరియాలతో సమ్మిళితంతో పంటకు పోషకాలు రసాయనాలను ఎరువులు, సూక్ష్మజీవుల చర్యల వలన మాత్రమే, మొక్కకు అందించడం జరుగుతుంది. పశువుల ఎరువు కంపోస్ట్ వర్మీ కంపోస్ట్, ఎరువులు వలన సూక్ష్మ జీవులు పెరుగుతాయి. దీర్ఘకాలికంగా భూసారం పెరుగుతుంది. సంప్రదాయ పంటల నుంచి కూరగాయల సాగుకు మారడం వల్ల లాభాలు. కూరగాయల పంటల ద్వారా త్వరగా ఆదాయం పొందవచ్చు మార్కెట్‌లో డిమాండ్ ఎక్కువగా ఉండటం వల్ల లాభం ఎక్కువ. వరి పంటకు ఎక్కువ నీరు అవసరం కూరగాయల పంటలకు తక్కువ నీరు సరిపోతుంది. భూమి ఆరోగ్యం మెరుగుదల, పంట మార్పిడి వల్ల భూమిలో పోషకాల సమతుల్యతఉంటుంది. సంవత్సరంలో 2-3 పంటలు తీసుకోవచ్చు. ఈకార్యక్రమంలో హాజీపూర్ మండల వ్యవసాయ అధికారి క్రిష్ణ, హార్టికల్చర్ అధికారి సహజ, ఆత్మ చైర్మన్ మురళీ,ఆత్మ సభ్యులు శ్రీనివాస్, బలమల్లు, రైతు ఉత్పత్తి దారుల సంఘం డైరెక్టర్లు బొడ్డు శంకర్, రైతులు పాల్గొన్నారు.



## ఏరియా జిఎం కార్యాలయంలో ఆడిట్ కమిటీ సమావేశం

**మందమర్రి, మార్చి 12, ప్రభాతవార్త**

సింగరేణి మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఆడిట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్ఓటు జిఎం జి.ఎల్ ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై సమావేశాన్ని ప్రారంభించారు. ఈ సమావేశంలో ఇంటర్నల్ కమిటీ సభ్యులు డి. దామోదర్ రావు డిప్యూటీ జనరల్ మేనేజర్, ఫైనాన్స్-ఇంటర్నల్ ఆడిట్ 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మందమర్రి ఏరియాకు చెందిన ఉన్నతాధికారులను పలు అంశాలపై ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. ప్రత్యేకంగా ఆడిట్ రికవరీలు, పెండింగ్‌లో ఉన్న ఆడిట్ మెమోలు, హౌస్ బిల్డింగ్ లోన్ ఇంట్రెస్ట్ రీయింబర్స్‌మెంట్ స్కీమ్‌కు సంబంధించిన క్లెయిమ్ వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకుని సమీక్షించారు. అధికారులు సమగ్ర వివరాలు అందించగా ఇంటర్నల్ ఆడిట్ కమిటీ సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కే గ్రూప్ ఏజెంట్ అబ్దుల్ ఖాదీర్, ఏరియా ఇంజనీర్ ఈ అండ్ ఎం బాలాజీ భగవతి, డీజీఎం పర్సనల్ అశోక్, ఇంటర్నల్ ఆడిట్ కమిటీ సభ్యులు డి. దామోదర్ రావు, డీవైజీఎం ఎఫ్ అండ్ ఎ సరిత, సివిల్ ఎస్ఈ శ్రీధర్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సత్యనారాయణ, ఆడిట్ కమిటీ సభ్యులు జె. శేషు కుమార్ సీనియర్ అకౌంట్ ఆఫీసర్, ఉదయ్ కిరణ్, డి. రాజశేఖర్ జూనియర్ అకౌంటెంట్‌తో పాటు మందమర్రి ఏరియాలోని వివిధ గనులు, విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## పదవ తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం: ఎంఈఓ

**వేమనపల్లి, మార్చి 12, ప్రభాతవార్త**

మండల కేంద్రంలో మార్చి 14 నుంచి పదో తరగతి పరీక్షలకు అంతా సిద్ధమైనట్టు ఎంఈఓ శ్రీధర్ రెడ్డి తెలిపారు. మండలంలోని ఎహెచ్ఎస్ బాలుర ఆశ్రమ పాఠశాలలో పరీక్షలకు సిద్ధం చేశారు. ఈ సంవత్సరం 188 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్టు పేర్కొన్నారు. జడ్‌పిహెచ్ఎస్ వేమనపల్లి 44, ఏహెచ్ఎస్ నుండి 58, కస్తూర్బా నుండి 48, జడ్పిహెచ్ఎస్ నీల్వాయి నుంచి 38 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్షల నిర్వహణకు ఇన్విజిలేటర్లు, ప్రత్యేక అధికారి, సిబ్బంది విధులు నిర్వహిస్తారన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు కూడా ఉంటుందన్నారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా వసతులు కల్పించామని, విద్యార్థులు నిర్భయంగా పరీక్షలు రాయాలని కోరారు.

## బిజెపి తెలంగాణ మీడియా ప్యానలిస్టుగా అడ్వకేట్ తులా ఆంజనేయులు

**మంచిర్యాల, మార్చి 12, ప్రభాతవార్త**



మంచిర్యాల జిల్లా వాసి తులా ఆంజనేయులుకు బిజెపి తెలంగాణ మీడియా ప్యానలిస్టుగా నియమించారు. తుల ఆంజనేయులు విద్యార్థి ఏబీవీపీలో ఎన్నో రకాల బాధ్యతలు నిర్వహించగా, 2003లో కళాశాల ప్రెసిడెంట్ గా కరీంనగర్ బీసీ, ఎస్సీ, ఎస్టీ, హాస్టల్స్ ఇన్చార్జిగా, స్టడీ సర్కిల్ ఇన్చార్జిగా అదే విధంగా మంచిర్యాల పట్టణ కార్యదర్శిగా మంచిర్యాల జిల్లా కన్వీనర్‌గా బీజేవైఎంలో ఉమ్మడి అదిలాబాద్ జిల్లా అధ్యక్షునిగా, రాష్ట్ర సహాయ కార్యదర్శిగా, రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఎన్నో రకాల సేవలు అందించారు. విద్యార్థి, తెలంగాణ ఉద్యమంలో ఎన్నో రకాల కార్యక్రమాల్లో ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ ముందుకెల్తూ ఉన్నాడు. గురువారం రోజు బిజెపి గుర్తించి తనకు బిజెపి తెలంగాణ మీడియా ప్యానలిస్టుగా నియమించడం చాలా ఆనందదాయకంగా ఉందని తెలియజేస్తూ బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, బీజేపీ అధికార ప్రతినిధి ఎన్.వి సుభాష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్, బిజెపి మంచిర్యాల జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్ గౌడ్, గోమాస శ్రీనివాస్‌లకు ధన్యవాదాలు తెలియజేశారు.

## రెగ్యులర్ ఈవోను ఏర్పాటు చేయాలి

**జన్నారం, మార్చి 12, ప్రభాతవార్త**




జన్నారం మండలంలోని పొనకల్ మేజర్ గ్రామ పంచాయతీలో రెగ్యులర్ ఈవోను ఏర్పాటు చేయాలని వార్డు మెంబర్ ముడుగు ప్రవీణ్ అన్నారు. పొనకల్ మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి విధులు నిర్వహిస్తున్న రాహుల్‌ను ఇన్చార్జి ఈవోగా ఏర్పాటు చేసి నాలుగు సంవత్సరాలు గడుస్తున్నా రెగ్యులర్ ఈవోను ఏర్పాటు చేయకపోవడం దారుణమని, పదివేల మంది జనాభా కలిగి ఉన్నందున వారి ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకుని ప్రజల సౌకర్యార్థం అనుభవం ఉన్న రెగ్యులర్ ఈవోను తొందరగా నియమించాలని, గ్రామ పంచాయతీ అభివృద్ధికి మార్గం సుగమం అవుతుంది అని 11వ వార్డు మెంబర్ ముడుగు ప్రవీణ్ జిల్లా అధికారులను కోరారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచిత వైద్య శిబిరం

**జన్నారం, మార్చి 12, ప్రభాతవార్త**

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజులు కార్యక్రమంలో భాగంగా గురువారం రోజున మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో మంచిర్యాల జిల్లాకు చెందిన స్త్రీల వైద్య నిపుణురాలు డాక్టర్ అలివేణి, కంటి వైద్య నిపుణురాలు డాక్టర్ శిల్ప, కీళ్లు, ఎముకల స్పెషలిస్ట్ డాక్టర్ ప్రవీణ్ విద్యాసాగర్, జనరల్ ఎండి సాయి పవన్, పిల్లల వైద్య నిపుణురాలు డాక్టర్ స్వాతిలు పలువురికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు అందచేశారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ ఉమశ్రీ, డాక్టర్ లక్ష్మీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



## నూతన బ్రిడ్జ్ పనులు ప్రారంభం

**ఉట్నూర్, మార్చి 12,ప్రభాత వార్త:**

మండలంలోని పులిమడుగు గ్రామ సమీపంలోని ప్రధాన రోడ్డుపై పాత బ్రిడ్జ్ స్థానంలో నూతన బ్రిడ్జ్ నిర్మాణానికి పనులు ప్రారంభమయ్యాయి. దీంతో గతంలో ప్రమాదకరమైన బ్రిడ్జ్‌పై భయం భయంగా ప్రయాణించిన ప్రజలు నిర్మాణ పనులు ప్రారంభం కావడంతో ఆనందం వ్యక్తం చేశారు. అలాగే బ్రిడ్జ్ నిర్మాణ పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, అలాగే తాత్కాలిక రోడ్డుపై జాగ్రత్త వహించాలని అధికారులు సూచించారు.



## ప్రజల సహకారంతోనే టీబీ రహిత సమాజం సాధ్యం

### - వెంకట్రావుపేట వైద్యాధికారి డాక్టర్ సతీష్

**లక్షెట్టిపేట, మార్చి 12, ప్రభాతవార్త**

ప్రజలందరి సహకారంతో త్వరలోనే టీబీ రహిత భారతదేశం దిశగా ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని వెంకట్రావుపేట వైద్యాధికారి డాక్టర్ సతీష్ కుమార్ అన్నారు. గురువారం లక్షెట్టిపేట మున్సిపల్ పరిధిలోని ఇటిక్యాల మూడో వార్డులో జరిగిన టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజలకు క్షయ వ్యాధి పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మండలంలోని కొత్తూర్ గ్రామాన్ని ఇటీవల టీబీ రహిత గ్రామంగా ప్రకటించడం జరిగిందని తెలిపారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్ లో భాగంగా రెండో విడత కార్యక్రమంలో అనుమానితులందరికీ ప్రజల వద్దకే వెళ్లి పోర్టబుల్ మొబైల్ ఎక్స్‌రే ద్వారా ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించి టీబీ నిర్ధారణ చేసినట్లు తెలిపారు. 60 సంవత్సరాలు పైబడిన వారు, బిపి, షుగర్ ఉన్న వారు, గుట్కా, అంబార్‌తో పాటు బీడీ , సిగరెట్, మద్యం సేవించేవారు, గతంలో క్షయ వ్యాధి సోకిన వారి కుటుంబ సభ్యులు తప్పనిసరిగా ఈ వైద్య శిబిరాలలో పరీక్షలు నిర్వహించుకుని వ్యాధి నిర్ధారించుకుని ప్రభుత్వానికి సహకరించాలని ఆయన కోరారు. ఈ రోజు ఇటిక్యాల వార్డులో,రేపు ఊత్కూర్ ఏరియాలో క్యాంపులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ సతీష్ కుమార్ కోరారు. ఇటిక్యాలలో 90 మందికి ఎక్స్ రే పరీక్షలు 20 మందికి తెమడ పరీక్షలు,100 మందికి షుగర్, బీపితో పాటు సాధారణ పరీక్షలు నిర్వహించి వారికి మందులను అందజేసినట్లు డాక్టర్ సతీష్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టీబీ సూపర్ వైజర్ సురేష్, ఎంఎల్ హెచ్ పి అంజలి, హెల్త్ అసిస్టెంట్లు గఫూర్, ఇసాక్ అహ్మద్, ఏఎన్ఎంలు విజయదర్శిణి, చిలకమ్మ, ఆశావర్కర్లు హైమవతి, విజయ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్కపల్లి రైతు వేదికలో తైవాన్ స్ప్రేయర్ల పంపిణీ

**పెంచికల్ పేట్, మార్చి 12, ప్రభాతవార్త :**

మండలంలోని ఎల్కపల్లి రైతు వేదికలో ప్రభుత్వం సబ్సిడీపై మంజూరు చేసిన పది తైవాన్ స్ప్రెయర్లను గురువారం రైతులకు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ తిరుపతి, వ్యవసాయధికారి రామకృష్ణ పాల్గొని యంత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల కోసం అందిస్తున్న పథకాలను వినియోగించుకుని లబ్ధి పొందాలని సూచించారు. సబ్సిడీపై అవసరమైన వ్యవసాయ యంత్రాలు కావాలనుకునే రైతులు తమకు సమీపంలోని వ్యవసాయ విస్తరణ అధికారి, వ్యవసాయధికారిని సంప్రదించి దరఖాస్తూ చేసుకోవాలన్నారు. సాగు విధానాలపై ఎలాంటి సందేహాలు ఉన్నా వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని, రైతులకు అవసరమైన అన్ని రకాల యంత్ర పరికరాలు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ అధికారి రామకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ వంశీ తో పాటు పలు గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.



రైతులకు తైవాన్ స్ప్రేయర్లు పంపిణి చేసిన ఏవో, తహసీల్దార్

# తప్పిపోయిన యువతిని కుటుంబానికి చేర్చిన పోలీసులు

### - సీఐ కుమారస్వామి సమయోచిత చర్యతో యువతి సురక్షితం

**కాగజ్‌నగర్, మార్చి 12, ప్రభాతవార్త**

కాగజ్‌నగర్‌లో తప్పిపోయి తిరుగుతూ కనిపించిన మానసిక స్థితి సరిగా లేని యువతిని పోలీసులు గుర్తించి చికిత్స అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. కాగజ్‌నగర్ రూరల్ సీఐ కె. కుమారస్వామి తెలిపిన వివరాల ప్రకారం నంద్యాల జిల్లా పొన్నాపురం గ్రామానికి చెందిన జగటి సయేశ్వరి (20) ఈ నెల 8న తిరుపతిలో ట్రైన్ ఎక్కి ప్రయాణం చేస్తుండగా కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్ వద్ద నీరు తాగేందుకు దిగింది. అయితే ఆమె నీరు తాగేలోపే ట్రైన్ వెళ్లిపోవడంతో అక్కడే చిక్కుకుంది.ఆ తరువాత యువతి కాగజ్‌నగర్ పట్టణంలో తిరుగుతూ అదే రోజు రాత్రి బొరిగవం ప్రాంతంలోని షణ్ముఖ హాస్పిటల్ సమీపంలో ఉన్న హోటల్ వద్ద ఉండగా స్థానికులు గమనించి డయల్-100కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే కాగజ్‌నగర్ రూరల్ సీఐ కె. కుమారస్వామి, ఎస్ఐ కె. సందీప్ కుమార్ పోలీసు సిబ్బందితో అక్కడికి చేరుకుని యువతిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆమెను ఆసిఫాబాద్‌లోని సచ సెంటర్‌కు తరలించారు.తర్వాతి రోజు సచ సెంటర్ కౌన్సిలర్ సుమలత సహకారంతో రూరల్ సీఐ సూచనల మేరకు ఎస్ఐ సందీప్ కుమార్, ఏఎస్ఐ రాము, మహిళా కానిస్టేబుల్ సుచరిత యువతిని మంచిర్యాలలోని కల్వరి యువశక్తి అనాధ ఆశ్రమంలో చేర్పించారు. అక్కడ ఆశ్రమ నిర్వాహకులు ఆమెకు సంరక్షణ కల్పించారు. అనంతరం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో మానసిక వైద్యులు డా. అజ్మీర్ రాము నాయక్ ద్వారా చికిత్స అందించారు.చికిత్స అనంతరం యువతి కొంత కోలుకొని ఒక ఫోన్ నంబర్ చెప్పడంతో ఆశ్రమ నిర్వాహకులు ఆ నంబర్‌కు సంప్రదించారు. ఆ నంబర్ యువతి భర్త ఫణికి చెందినదిగా గుర్తించారు. వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో యువతి తండ్రి జగటి శివయ్య, పెద్దనాన్న నాగార్జున, బంధువు కిరణ్ గురువారం ఉదయం మంచిర్యాలలోని కల్వరి యువశక్తి ఆశ్రమానికి వచ్చారు.అనంతరం ఆశ్రమ వ్యవస్థాపక అధ్యక్షుడు డా. ములుకాల కుమార్ (కల్వరి కుమార్) సమక్షంలో, కాగజ్‌నగర్ రూరల్ సీఐ కె. కుమారస్వామి సమక్షంలో యువతి జగటి సయేశ్వరిని కుటుంబ సభ్యులకు అప్పగించారు. యువతిని గుర్తించి సురక్షితంగా కుటుంబ సభ్యులకు చేర్చడంలో పోలీసులు, సచ సెంటర్ సిబ్బంది, ఆశ్రమ నిర్వాహకులు సమన్వయంతో పనిచేయడం అభినందనీయమని స్థానికులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా యువతి కుటుంబ సభ్యులు పోలీసులకు, వైద్యులకు, ఆశ్రమ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. సమయానికి స్పందించి యువతిని కాపాడి కుటుంబానికి చేర్చిన పోలీసుల సేవలను ప్రశంసించారు.



సీఐ కుమారస్వామి నేతృత్వంలో యువతి అప్పగింత

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో ఉట్నూర్ సర్పంచ్

**ఉట్నూర్, మార్చి 12,ప్రభాత వార్త :**



మండలంలోని ఉట్నూర్ గ్రామపంచాయతి సర్పంచ్ అనిత జాదబ్, లక్కారం గ్రామపంచాయతి సర్పంచ్ రేణుక అజ్మీరాలు 99 రోజుల సర్పంచ్ శిక్షణ కార్యక్రమం లో గురువారం పాల్గొన్నరు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక శిక్షణ కార్యక్రమంతో గ్రామపంచాయతి లను సర్పంచ్‌లు అభివృద్ధికి చేసే దిశగా ముందుకు వెళ్తామన్నారు.

# ప్రమాదవశాత్తు చెరువులో పడ్డ ఎడ్ల బండి

### ఎద్దు మృతి.... ప్రాణాలతో బయటపడ్డ రైతు

**తాండూర్, మార్చి 12, ప్రభాతవార్త :**

తాండూర్ గ్రామ శివారులోని పెద్ద చెరువులో గురువారం ప్రమాదవశాత్తు ఎడ్ల బండి పడి ఎద్దు మృతి చెందగా, రైతు త్రుటిలో ప్రాణాలతో బయటపడ్డాడు. స్థానికులు కథనం ప్రకారం.... మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన దాగం మల్లయ్య అనే రైతు తన చేను నుంచి ఎడ్ల బండి కట్టుకుని దగ్గరలో ఉన్న పెద్ద చెరువులో ఎద్దులకు నీళ్ళు తాగించడానికి వెళ్ళాడు. అక్కడ లోతుగా ఉండడంతో ఎడ్లబండితో పాటు రైతు నీళ్లలో పడిపోయాడు. రైతు తేరుకొని ఎడ్లబండిని వదిలి నీళ్లలో ఈదుకుంటూ ప్రాణాలతో బయటకు వచ్చాడు. చెరువు నీటిలో మునిగి ఒక ఎద్దు మృతి చెందగా, మరో ఎద్దు ప్రాణాలతో బయటపడింది. ఈ ఘటనలో రూ.70 వేలు విలువ చేసే ఎద్దు మృతి చెందిందని, రూ.30 వేల విలువ గల ఎడ్లబండి దెబ్బతిన్నదని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం, అధికారులు స్పందించి తనకు తగిన నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతు కోరారు.



ప్రాణాలతో బయటపడిన రైతు, మృతి చెందిన ఎద్దు

## బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా అశోక్ ముస్తాపురే నియామకం

**ఇచ్చోడ, మార్చి 12, ప్రభాతవార్త:**



ఇచ్చోడ మండల కేంద్రంలోని పొన్న గ్రామానికి చెందిన మాజీ జెడ్పీటీసీ అశోక్ ముస్తాపురే భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమితులయ్యారు. గతంలో ఆయన ఆర్ఎంపీ వైద్యుడిగా సోనలలో సేవలందించారు. రాజకీయ ప్రస్థానంలో భాగంగా గతంలో టీడీపీ, బీఆర్ఎస్ పార్టీలలో పనిచేసిన ఆయన, మాజీ జెడ్పీటీసీగా మండల ప్రజలకు అందుబాటులో ఉన్నారు. మండలం నుంచి ఒకరికి రాష్ట్రస్థాయిలో గుర్తింపు లభించడం, అలాగే అదిలాబాద్ ఎంపీ, ఎమ్మెల్యేలు కూడా బీజేపీకి చెందిన వారు కావడంతో జిల్లాలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని స్థానిక కాషాయ శ్రేణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి. ఆయన నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.



## అగ్నిప్రమాద బాధితులకు బలరాం జాదవ్ ఆర్థిక సాయం

**నేరడిగొండ, మార్చి 12, ప్రభాతవార్త:**

నేరడిగొండ మండలం బోరిగామ గ్రామంలో అగ్నిప్రమాదానికి గురైన కుటుంబాలను రాష్ట్ర అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ పరామర్శించారు. గురువారం జరిగిన ఈ ప్రమాదంలో ఐదు ఇళ్లు పూర్తిగా కాలిపోయి బూడిదయ్యాయి. ఈ విషయం తెలిసిన వెంటనే ఆయన గ్రామానికి చేరుకుని బాధితులను ఓదార్చారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్న ఆయన, బాధితులకు తక్షణ సాయం కింద రూ. 10,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కష్టకాలంలో ఆదుకోవాలనే ఉద్దేశంతో ఈ సాయం చేసినట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వం బాధితులకు అండగా ఉండి ఆదుకోవాలని ఆయన కోరారు.



## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

నిర్మల్, మార్చి 12, ప్రభాతవార్త:

నిర్మల్ జిల్లా కేంద్రం సమీపంలోని కొండాపూర్ బైపాస్ వద్ద గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందగా, పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలం సోంపల్లి గ్రామానికి చెందిన సుమారు 15 మంది బంధుమిత్రులు బొలెరో వాహనంలో ఆర్మూర్‌లో జరగనున్న వివాహానికి బయలుదేరారు. మార్గమధ్యలో ఒక్కసారిగా వాహనం వెనుక టైరు పేలిపోవడంతో డ్రైవర్ నియంత్రణ కోల్పోయి వాహనం పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో సోంపల్లి గ్రామానికి చెందిన బోయిన్వాడ్ తులసిరామ్ (38), బరాడే లక్ష్మణ్ (55) అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన బాలాజీ అనే వ్యక్తిని మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించగా, మిగిలిన 10 మందికి నిర్మల్, ఆదిలాబాద్ ఆసుపత్రుల్లో చికిత్స అందిస్తున్నారు. పెళ్లి వేడుకకు వెళ్తుండగా జరిగిన ఈ విషాదంతో సోంపల్లి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




## ప్లాస్టిక్ నిషేధంపై గ్రామాల్లో అవగాహన

సారంగాపూర్, మార్చి 12, ప్రభాతవార్త:

ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సారంగాపూర్, బీరవెల్లి, స్వర్ణ గ్రామ పంచాయతీలలో ప్లాస్టిక్ నిషేధంపై గురువారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు కృష్ణ, ప్రేమలత ప్రజలకు ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ప్లాస్టిక్ భూమిలో కలిసిపోకపోవడం వల్ల భూసారం దెబ్బతిని పంటలు పండవని, అలాగే ప్లాస్టిక్ కవర్లలో ఆహార పదార్థాలను పారవేయడం వల్ల వాటిని తిన్న పశువులు అనారోగ్యానికి గురై మృత్యువాత పడుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు చికెన్, మటన్ షాపులకు వెళ్లేటప్పుడు ప్లాస్టిక్ కవర్లకు బదులుగా టిఫిన్ బాక్సులను వెంట తీసుకెళ్లాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా దుకాణాలలో ప్లాస్టిక్ కవర్లను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని యజమానులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మల్టీపర్పస్ వర్కర్లు, గ్రామ యువత, ప్రజలు పాల్గొన్నారు.


## బాధిత కుటుంబాలకు ఆదుకుంటాం

### - కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్

నేరడిగొండ, మార్చి 12, ప్రభాతవార్త:



అగ్నిప్రమాదంలో ఇళ్లు కోల్పోయిన బాధిత కుటుంబాలను ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా ఆదుకుంటామని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ భరోసా ఇచ్చారు. నేరడిగొండ మండలం బోరిగం గ్రామంలో అగ్నిప్రమాదం జరిగి నాలుగు ఇళ్లు, రెండు కొట్టాలు కాలిపోయిన విషయం తెలుసుకున్న ఆయన, గురువారం గ్రామాన్ని సందర్శించారు. స్థానిక ఎంపీడీవో, రెవెన్యూ అధికారులతో కలిసి ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాధితులకు తక్షణ సహాయం కింద నిత్యావసర సరుకులు అందజేస్తామని తెలిపారు. ఇళ్లు కోల్పోయిన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా కొత్త ఇళ్లు మంజూరు చేయించేలా జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుతో మాట్లాడతానని హామీ ఇచ్చారు. బాధితులకు అండగా నిలవాలని గ్రామస్థులను కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాథోడ్ వినీష్, నాయకులు మున్నా మహారాజ్, మోహన్, మదన్ సింగ్, పోతారెడ్డి, సద్దాం, పవన్, సందీప్, గులాబ్ సింగ్ పాల్గొన్నారు.




మ్యాప్‌ను పరిశీలిస్తున్న డీఎఫ్ఓ నీరజ్‌కుమార్ టేబ్రివాల్



ఇటుకల పహాడ్ అటవీ ప్రాంతంలో పర్యటిస్తున్న అటవీశాఖ అధికారులు

### ఇటుకలపహాడ్ ప్లాంటేషన్

# పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తాం

### - డీఎఫ్ఓ నీరజ్ కుమార్ టేబ్రివాల్

సిర్పూర్ (టి), మార్చి 12, ప్రభాతవార్త;

సిర్పూర్ (టి)మండల మండలంలోని ఇటుకల పహాడ్ అటవీ ప్లాంటేషన్లో గురువారం కొమరం భీం జిల్లా డిఎఫ్ఓ నీరజ్ కుమార్ టేబ్రీవాల్ పర్యటించారు. ఆయన మాట్లాడుతూ ఇటుకల పహాడ్ ప్లాంటేషన్ను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని అన్నారు. తాడోబా నుండి పులులు రాకపోకలు జరుపుతాయని తెలిపారు. ఈ ప్రాంతంలో రెండు పులులు ఆవాసం ఏర్పరచుకున్నాయని అన్నారు. సిర్పూర్ రేంజ్ పరిధిలోనీ ఇటుకల పహాడ్ లో వెయ్యి ఎకరాల్లో ప్లాంటేషన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎఫ్డిఓ అప్పయ్య మాట్లాడుతూ పులుల ఆవాశ కేంద్రంగా ఇటుకల్పహాడ్ ఉందని అటవీ సంపదను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. వన్య ప్రాణులకు నీటి ఎద్దడి లేకుండా బోర్ బావులు, కుంటలు, చెక్ డ్యాములు, సాసర్ ప్లేట్స్ ఏర్పాటు చేసినట్లు ఎఫ్ ఎస్ ఓ మోహన్ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి బి వెంకట్, ట్రైని ఐఎఫ్ఎస్ అధికారి భార్గవ్, సిర్పూర్ ఇంచార్జ్ రేంజ్ అధికారి ప్రవీణ్ కుమార్, ఎఫ్ఎస్ఓ వల్కమోహన్ రావు,మండలాల రేంజ్ అధికారులు, సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్టియు జిల్లా అధ్యక్షుడిగా హబీబ్ పాషా నియామకం

తాండూర్, మార్చి 12, ప్రభాతవార్త :

మండలంలోని రాజీవ్ నగర్ గ్రామ పంచాయతీకి చెందిన మహమ్మద్ హబీబ్ పాషా ను బి ఆర్ టి యు మంచిర్యాల జిల్లా అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు బి ఆర్ టి యు రాష్ట్ర కార్మిక విభాగ రాష్ట్ర అధ్యక్షులు రాంబాబు, ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వేముల మారయ్య, రాష్ట్ర కార్యదర్శి నిలరాపు రవి, రేణిగుంట సురేష్ లు హబీబ్ పాషాకు నియామక ఉత్తర్వులు అందజేశారు. హబీబ్ పాషా మాట్లాడుతూ అందరి సహకారంతో యూనియన్ ను బలోపేతం చేసి, కార్మికుల సమస్యలు, హక్కుల కోసం పోరాటం చేస్తానని అన్నారు. జిల్లా అధ్యక్షుడిగా నియమించినందుకు రాష్ట్ర, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.




హబీబ్ పాషా కు నియామక నియామక ఉత్తర్వులు అందజేస్తున్న రాష్ట్ర నాయకులు

## మార్చి 16న ఛలో హైదరాబాద్ ధర్నాను జయప్రదం చేయండి

### - అంగన్వాడీ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలి

### - జిల్లా ఐసీడిస్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ కు వినతిపత్రం అందజేసిన సీఐటీయు నాయకులు

మంచిర్యాల ప్రతినిధి,
మార్చి 12, ప్రభాతవార్త

అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో అంగన్వాడి ఉద్యోగుల సమస్యలపై మార్చి 16న ఛలో హైదరాబాద్ ధర్నా విషయంపై గురువారం రోజున జిల్లా ఐసీడిఎస్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ మల్లేశం కు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా దుంపల రంజిత్ కుమార్ సీఐటీయు జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు అంగన్వాడి ఉద్యోగులకు హామీలు ఇచ్చి రెండు సంవత్సరాలు దాటిన హామీలు మాత్రం అమలు చేయట్లేదు అంతే కాకుండా ఐసిడిఎస్ను నిర్వీర్యం చేయడానికి కేంద్ర బీజేపీ ప్రభుత్వం ఎన్.ఈపి ని తెచ్చింది. రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్.ఈపి ని అమలు చేయకుండా అసెంబ్లీలో తీర్మానం చేయాలి. ఫిక్స్డ్ వేతనం, రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఐసిడిఎస్ కు బడ్జెట్ను పెంచాలి. ప్రభుత్వ పాఠశాల మాదిరిగానే అంగన్వాడీ కేంద్రాలకు వేసవి సెలవులు ఇవ్వాలన్నారు. ఇతర సమస్యల పరిష్కారానికై జరిగేటువంటి ధర్నాకు జిల్లాలోని అంగన్వాడీ ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయగలరని అన్నారు. ఈ కార్యక్రమంలో భానుమతి అంగన్వాడి యూనియన్ జిల్లా అధ్యక్షురాలు, అనురాధ జిల్లా ఉపాధ్యక్షురాలు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న సీఐటియు నాయకులు